

# లోగుట్టు

స్కెచ్

యాముజాల శంకరం

"విసుగెత్తే నిజంగా కొట్టానురా. మొన్నటి నుంచి తిప్పుతున్నాడు. చిరాకు, కోపం, అసహ్యం... ఎన్ని కలగటానికి అవకాశముందో, అన్నీ నాలో కలిగాయి. నిజంగా ఉన్మత్తుడనయ్యే కొట్టానంటే యింకా బాగుంటుందేమో!..." ఉద్రేకంలో చెప్పుకుపోతున్నాడు రంగారావు.

"ఏం జరిగిందిరా?..." మధ్యలో కల్పించుకొని అడిగాను.

"మొన్న ఆ ఆఫీసుకు ఒక పనిమీద వెళ్ళాల్సి వచ్చింది, అయితే ఆ ఫలానిపని నాది కాదనుమా. మా అన్నయ్య మద్రాసు ఏదో పని మీద వెళుతూ, ఈ పని అర్జంటుగా చేయమనినన్ను నియమించి వెళ్ళిపోయాడు. అర్జంటుగా చేయమన్నాడు కాబట్టి ఆపనిచేసి ఆ కాగితం పొందకపోతే ఏం ప్రమాదం వస్తుందోనని భయపడ్డా. మనకా వ్యవహారాల విషయంబొత్తిగా తెలియదు. ఏ వ్యవహారానికి ఏమేమి ముఖ్యమో అంతకంటే తెలీదు. ఆ కాగితం పొందనందువల్ల కలిగే లాభనష్టాలంతకంటే తెలీదు. మనలో నా ఉద్రేకం జాస్తి. నా అనుమానంవల్ల భయపడి ఆ ఆఫీసుకి పదేపదే పరిగెత్తా.

"అయితే ఏంజరిగిందనుకున్నావ్. మొదటి రోజు వెళ్ళా. గుమాస్తా చాలా బిజీగావున్నాడు. పలకరించితే బాగుండదుగా; అందులో పనిమీద వెళ్ళినవాడినయితిని. నిలుచున్నాను. ఓ అరగంట నిలుచున్నా. ఈ కాగితం అటు పారేస్తాడు, ఆ కాగితం యిటుపారేస్తాడు... ఏవేవో పుస్తకాలు తెమ్మని జవాన్లను కేకలు పెట్టేవాడు... ఏవేవో కాగితాలు అయ్యగారి (ఆఫీసరు గారన్నమాట) సంతకం కాలేదని తిట్టేవాడు.

నాకు చిరాకెత్తుతోంది. తానామీద గుర్రంలాగా నిలుచోవడం కష్టంకదూ. ఆప్రక్క కుర్చీలున్నాయి, బల్లలున్నాయి. కూర్చుంటే ఏం ప్రమాదమో; వాళ్లెవరూకూర్చోమనలేదు; అందుకని కూర్చోలేదు. ఆఖరుకు తెగించి ఆయన్ను సమీపించి విషయం వివరించుదామనుకున్నా. కాని సగంలోనే అసలు విషయం గ్రహించాడాయన. ముఖ్యంగా నా దద్దమ్మతనం తప్పకండా పసిగట్టిఉంటాడు.

"ఏం కనబట్టంలేదూ? మా విషయం ఒక్కడాలోచించడు. ప్రతివాడు రానూ, ప్రాణాలుతీయనూ. ఎక్కడ చచ్చేది. కనీసం వాళ్ళను ఎప్పుడు పలకరించాలో, ఎప్పుడు పలకరించకూడదోనన్న పరిజ్ఞానం కూడా ఉండదు. పోవయ్యా! సాయంకాలం రా పో" అంటూ అతిగా కసురుకున్నాడు చేసేదిలేక నోరు మూసుకొని వెనక్కు తిరిగాను. నేను వస్తూంటే అంటాను, "అబ్బబ్బ!... వెధవ గుమాస్తాగిరీ చస్తున్నాను. ప్రతివాడు ప్రాణాలు కొరికేసే వాడేనాయె. న్యూసెన్సు..."

తరువాత పదాలకు రాగాలు దీర్ఘాలు పెడుతున్నాడు. కనీసం యిప్పుడుకాదు పొమ్మని చెప్పిన అతని ఉదారతకు మెచ్చుకుంటూ నేనైతే వచ్చేశా. వస్తూంటే నాకేం అనుపించిందో చెబుతా విను. నిజంగా నావల్ల విసుగెత్తిపోయి అలా అనిఉంటాడేమోననే సానుభూతి కలిగింది. లేదా నేనెవర్నో ఎవరితాలూకో తెలుసుకో

కుండానయినా అని ఉండాలి. ఎందుకంటే ఆఫీసర్లతోను, గుమాస్తాలతోను పరిచయమున్నవాడు. “ఆజ్ఞ లేనిదే లోనికిరాకూడదు” అన్న నిషేధాన్ని నిషేధిస్తూ ప్రవేశిస్తాడు. వాళ్లుకూడా మనుష్యుల్ని బట్టి గౌరవిస్తారు-అదేం ఖర్మమో మరి. అదీగాక, వాళ్ళముందు - నాకు వాళ్ళ జీవితాలతోను కుటుంబ విషయాలతోను సంబంధం లేకుండా మాట్లాడుతున్నాను సుమా! ఎలాంటివాడైనా, ఎంతవాడైనా తలవంచాల్సిందే. చేతులుకట్టి నిలబడాల్సిందే. ఆ కాసేపు 80 రూపాయిల గుమాస్తా రాజాధిరాజు. కోటిరూపాయిల ఖరీదుచేసే ఆసామీ జవాను. తప్పదు మరి స్థానబలిమిపై అంతస్థు వాళ్ళది...”

“ఏడిశావుగాని...అసలు విషయం చెప్పరా!” అంటూ మందలించాను. వాడేదో చెప్పుకుని పోతున్నాడు. చెప్పటం గమ్మత్తుగా- అరటిపండ్లు వలచి పెట్టినట్లుగా ఉంటుంది.

మొదలు పెట్టాడు—

“సరే తిరిగివచ్చాను. మళ్ళా టంచనుగా నాలుగింటికి హాజరయ్యా. నన్ను చూడగానే ప్లేటు మార్చేశాడు. సాయంకాలం అంటే ఏమిటర్థంరా? అంటావుగదా: “ఇంత ప్రొద్దుగూకి వస్తే ఎలాగనుకున్నావయ్యా. ఆఫీసరుగారు వెళ్ళిపోయారు. కాస్త ముందుగా రానక్కరలేదూ? పనులు కావలసినవాళ్ళకు మీకే తొందరలేదు. రేపురా. పోవయ్యా” అన్నాడు.

నాలుగు గంటలకే ప్రొద్దుగూకిపోయిందా? లేక సాయంకాలమంటె ఒంటిగంటకే నమ్మని అర్థమా? అలా అనుకుందామంటే పోనీ 12 గంటలదాకా ఉన్నవాణ్ణి. కాసేపాగవయ్యా అనవచ్చుగా? అర్థాలు-ఇలాంటివి ఏ గెజిట్‌లో ప్రచురించారురా. చిరాకెత్తకపోతే విమర్శించి ఉండేవాణ్ణి కాదు.

నెత్తిన గుడ్డవేసుకొని యింటికి బయలుదేరాను. పని కావలసినవాడినాయె. ఏమైనా అర్థాలు సాగదీసి చూపిస్తే ఏం ప్రమాదమో, మా అన్నయ్య వచ్చేలోపున యీ కాగితం సంపాదించలేకపోతే నన్ను అవహేళనచేస్తాడు. అప్పుడు నా డిగ్రీ కాగితాలు తీసుకొని పోయి పొయ్యిలో పెట్టాలి. పని యీయనవల్లనే అవుతుందని అన్నయ్యచెప్పి వెళ్ళాడు.

తెల్లవారి పదిగంటలకే వెళ్ళానురా. “ఆఫీసరుగారు రాలేదయ్యా. మళ్ళీరా-పో” అన్నాడు. వాళ్ళనిఘంటువులో ‘ఏమండి’ అన్నశబ్దం ఉండి ఉండదు. ఒకవేళ ఉన్నా దాని అర్థం...అర్థం కాకుండా...ఆ శబ్దం నిశ్శబ్దంగా ఉండిఉండాలి. “కాస్త ఆగవయ్యా!...” లేదా “మళ్ళీరా-పో” లేదా “ఏమిటా ఏక తొందర-” ఇవ్వి వాళ్ళ కోడిఫైడ్ లాంగ్వేజి.

మొత్తానికి అవ్వాళా పుణ్యకాలం కాస్తా గడిచిపోయింది. పని అయ్యే సూచనలు నాకెక్కడా కనుపించలేదు. నన్ను చూడగానే నొసలు చిట్లించి, పెద్ద చిరాకుగా ఉన్నట్లు నటించేవాడు. ఏమన్నా అంటే యింకా ఆలస్యంచేసి మరి నాలుగుసార్లు త్రిప్పుతాడేమోనని నాభయం. ఇంత చదువు చదివినవాడిని నన్నే పట్టీ దద్దమ్మను చేసి యిన్నిసార్లు త్రిప్పుతున్నాడు, అక్షరజ్ఞానశూన్యుల అగచాట్లు ఆ బ్రహ్మకే తెలియాలి.

మూడోనాడుకూడా ఏవేవో వంకలు పెడుతున్నాడు. ఒకఉద్దేశ్యం హృదయంలో ఉంటే ఎన్నైనా చేస్తారు. మనకా డొంకతిరుగుళ్ళేం తెలుస్తాయి! అక్కడ ఆ బెండరుంటె అతన్ని పట్టుకొని, కాస్త కాఫీ అది యిప్పించుకొని, మంచిచేసుకొని, విషయం కాస్త సవిస్తరంగా విన్నవించు నాయనా అని వేడుకున్నా. వాడు అసలు(సృష్టి) రహస్యం బయటపెట్టాడు.

వెంటనే నీ దగ్గరకువచ్చి అయిదురూపాయలు పట్టుకెళ్ళాను. ఎందుకని అడిగితే చెప్పకుండా పట్టుకుపోయాను జ్ఞాపకం లేదురా? అవి మేత వేయడానికన్నమాట.

ఆ గుమాస్తాను సమీపించి, లేనిగౌరవం తెచ్చుకొని కుర్చీలో కూర్చున్నా. నేను ఫలానివారి తమ్ముణ్ణని మొదట విన్నవించా. మా అన్నయ్య పేరు వినగానే—“ఫలాని ఆయన తమ్ముడవటయ్యా. చెప్పావు కావేం? ఇంతవరకు ఏవనే ననుకుంటున్నా. అయినా ఫరవాలేదులే మీ అన్నయ్య తోటదగ్గరకు పోతే నాలుగు వంకాయలు పెట్టాడుగాను. మేం కనుపిస్తాంటయ్యా మీకు—ఏదో పనివుందంటబట్టి గాని...” అన్నాడు.

నా మాదిరిగా ఏవేవో పనులమీదవచ్చిన పెద్ద మనుష్యులు, గుమాస్తాలు, జవాన్లు అందరూ ఒక్కసారి నవ్వారు. వాళ్ళంతా నవ్వుతూంటే కడుపులో మండుతున్నా, నేనూ నవ్వాను. ఇంకా ఏవో, ఏవో రాగాలు పెట్టాడు.

వీధి భాగోతాలు ఎప్పుడేనా చూచావురా. అందులో రాణీగారు ప్రసవిస్తోంది రమ్మని మంత్రసానికి కబురు పెడితే మంత్రసాని సాదిస్తుంది తెలుసా. 'పున్నంనాడు బూరెలు పెట్టారా?— అమావాస్యనాడట్లు పెట్టారా? నేను రానుపో' అంటుంది. అంతకు అధికంగా ఉందితని సాదింపు.

మెల్లగా అతన్ని బయటకుపిలచి "మా అన్నయ్య ఊళ్ళోలేడు. నాదగ్గర ఓ అయిదు మాత్రం ఉన్నాయి. అంతకంటె ఎక్కువ యిచ్చుకోలేనని"...ప్రాధేయపడ్డా.

తరువాత ఏమంటాడో తెలుసుగా. ఎంత బెట్టు చేయాలో-చెడగొట్టుకోకుండా,అంత బెట్టూ చేసాడు. అతను అ గ్ని ని ష్ఠా లాం టి వా డ ట. ఆద్యంగా పుచ్చుకోమంటె, అగ్నికి ఆద్యం పవిత్రమయింది కాబట్టి, లంచానికి కాస్త పేరు మార్చి నన్ను ఎక్కడా చెప్పవద్దని ఇంకా ఏవో ఏవో చెప్పి, నన్ను కట్టుకొని నా హృదయానికి విరుద్ధంగా నే-నే నతనికి ప్రీతిపూర్వకంగా సమర్పిస్తున్నా కాబట్టి తప్పని సరై మళ్ళీ నే నేదైనా అనుకుంటానేమోనని (వెధవకోతలు) అతని ఆత్మకు విరుద్ధంగానే (పచ్చినిజం)వప్పుకున్నాడు.

"ఇదిగో యివ్వాళ్లా యిహా నీపనే చేస్తా" నన్నాడు.

అసలు నాకోసం ఎంత కష్టపడ్డాడో చెబుతా విను. "ఊఁ" కొట్టిన ఆడదెంతలోకువవుతుందో, అంతకు రెట్టింపు లోకువవుతాడు ఇలాంటివాడు. ఆతని ప్రక్కనే కూర్చున్నా. ఇహ యిప్పుడెందుకు నాకు భయం. అతనికి నేనెందుకు గౌరవం చూపాలి, మర్యాద యివ్వాలి. వెలయాలికైతే ఎన్ని తళుకులు, బెళుకులు సొగసులుంటాయో, అన్ని ఉన్నాయి యితనిలో. రాకపోతే కను పరచే తోవ వేరు.

పెద్ద హంగామా చేశాడు. నా అయిదుకు రెండురెట్లు కష్టం అతనికున్నట్లు నటించాడు. చాలాకొంచెం అంటూ అప్పుడప్పుడూ నా నజరానాను విమర్శించాడు. మా అన్నయ్యే అయితే యింకెంతో యిచ్చేవాడట. ఆ భగవంతుడికే తెలియాలి అసలు విషయం.

అంతా హడావుడీ. ఒక ఫారం పూర్తిచేసి, దానిమీద ఆఫీసరుగారి సంతకం చేయించి, అది పుస్తకంలో ఎక్కించుకొని, ఆ కాగితం నా ముఖాన పారేశాడు. ఆ విషయందగ్గరుండి విమర్శనా దృష్టితో చూస్తున్నా కాబట్టి నా కర్థమయింది. మామూలువాళ్ళ కెలా తెలుస్తుంది విషయం. ఈ పాతాళ వ్యూహాలు బయటపడే దెట్లా.

కాగితమయితే నా చేతిలో పడింది. ఇహ చూడదని ఆత్రుత. నసగటం మొదలుపెట్టాడు. దొరికింది జుట్టు చేతి కనుకున్నాను. "కాఫీ త్రాగుదాం రండి" అన్నాను. లేచి బయలుదేరాడు.

ఓ ఫర్లాంగు పోతేగాని ఊళ్ళో కాఫీహోటలు దగ్గరికి పోము. రోడ్డు-రోడ్డుప్రక్క చింతచెట్లు బాగా పెరిగి చల్లని నీడనిస్తున్నాయి. చెట్ల నీడనే నడుస్తున్నాము. ఉండబట్టలేక "ఏమండి!...నా విషయం-" అన్నాడు. ఒక్కసారి, యీ మూడు రోజులలో, ఒకేఒక్కసారి, ఇప్పుడు అతని నోటి గుండా 'ఏమండీ' అన్న శబ్దం వినగలిగా. ఇంతవరకు డబ్బివ్వాలే దతనికి. అయిదు రూపాయిలు ఇమ్మన్నాడు. చాచి లెంపమీదకొట్టా. దవడ జారి గూడుదగ్గరకు వచ్చిందతనికి. గిర్రున నీళ్లు తిరిగాయి. మైకం క్రమ్మి ఉండాలసలు. తరువాత జాలిపడ్డాను చేయిఅయితే జారిపోయింది. చెంప మీద అయిదువేళ్ళు తీర్చి దిద్దినట్లు పడ్డాయి. నా హృదయంలో ఎవరో గుద్దినట్లుగా అనుపించింది. నిలువలేక పోయాను. అతను తలవంచి చెంప నిమురుకుంటున్నాడు.

"వెళ్ళొస్తా" చర్రున వచ్చేను. కాని రేపేం జరుగుతుందో భయంగా ఉంది. మళ్ళీ ఏదైనా పని కావలసి వస్తే ఏమిటిగతి? అన్నయ్యేమంటాడో?...తొందరపడ్డానేమో అనిపించింది."

"భ య ప డ కు రా..." సముదాయించాను వాడిని. "ఇది లోగుట్టు. బయటకు చెప్పకుంటాడటరా? మీ అన్నయ్య కెలా తెలుస్తుంది?... రహస్యం రహస్యంగానే ఉండిపోతుంది." ★